

ఆర్టీసీలో లక్కీడ్రా..
- విజేతలకు బహుమతుల ప్రదానం
- ప్రథమ బహుమతిగా రూ.25 వేలు

7



సర్వం సమ్మతమే..

- నేటి బీసీ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీల మద్దతు
- ప్రజా, కుల సంఘాల సంఘీభావం
- స్వరాష్ట్ర ఉద్యమం తర్వాత అందరి మద్దతు తొలిసారి
- 42 శాతం రిజర్వేషన్ల సాధనే ఏకైక లక్ష్యంగా ముందుకు..



మహబూబ్‌నగర్‌లో బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతున్న జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్, ప్రజా సంఘాల ప్రతినిధులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధన లక్ష్యంగా చేపట్టిన తెలంగాణ బంద్‌కు సకల జనుల మద్దతు లభించింది. అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికే మద్దతును ప్రకటించగా.. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు కూడా సంఘీభావం తెలపుతున్నాయి. ప్రభుత్వం నుంచి కూడా గ్రీన్‌సిగ్నల్ రావడం, ఎలాంటి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా బంద్ పాటించాలని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి కూడా ప్రకటించడంతో బంద్ విజయవంతమయ్యే అవకాశాలున్నాయి. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్థానిక సంస్థల్లో బీసీలకు ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్, చట్టం చేసి పంపించినప్పటికీ.. వాటికి ఆమోదం లభించ లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీఓ నెంబర్ 9 ద్వారా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసి.. కేటాయింపులు కూడా చేసింది. అయితే హైకోర్టులో దీనికి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు కావడం.. జీఓపై, స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సర్వోన్నత న్యాయస్థానం కూడా స్టేను ఎత్తివేయడానికి నిరాకరించడంతోపాటు 50 శాతంలోపు రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని బీసీ సంఘాలు నినదిస్తున్నాయి. జీఓల ద్వారానే కాకుండా చట్టాన్ని ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగానే శనివారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. బీసీ సంఘాలకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది.

రాష్ట్రం నుంచి జిల్లా వరకు..

శనివారం చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు రాష్ట్రం నుంచి జిల్లా వరకు అన్ని

(మిగతా 6లో..)

స్వరాష్ట్ర ఉద్యమం తర్వాత..

తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమకాలంలో సకల జనుల సమ్మె, సాగరహారం వంటి మహా ఘట్టాలకు సర్వజనుల మద్దతు లభించింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మరే బంద్‌కు, నిరసనకు, ధర్నాకు అంతభారీగా మద్దతు లభించలేదు. మొదటిసారి బీసీ బంద్‌కు మద్దతు వస్తుండటంతో స్వరాష్ట్ర ఉద్యమం గుర్తు చేస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు. బంద్ నేపథ్యంలో ఊర్లకు వెళ్లాల్సిన వారు తమ పర్యటనలను వాయిదా వేసుకోగా.. కావాల్సిన నిత్యావసరాలను ముందుగానే కొనుగోలు చేసుకున్నారు. పెట్రోల్ బంకులు కూడా బంద్ అయ్యే పరిస్థితి ఉండటంతో వాహనదారులు బంద్‌రోజుకు సరిపడా పెట్రోల్, డీజిల్‌ను కొనుగోలు చేసుకున్నారు. వరుసగా మూడురోజులు సెలవులు వస్తుండటంతో ఊర్లకు వెళ్లాల్సిన వారు శుక్రవారమే ప్రయాణమయ్యారు.

విద్య, వైద్యం అందించడమే
ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ వచ్చాకే సంక్షేమ పథకాల అమలు



మక్తల్ పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి

- వంద శాతం రాయితీతో 88 కోట్ల చేప పిల్లలు పంపిణీ
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ
- 'పేట' జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

మక్తల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాణాలతో కూడిన విద్య, మెరుగైన వైద్యం, పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సాంకేతిక శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని పెద్ద చెరువు ట్యాంక్‌బండ్ సుందరీకరణ, అభివృద్ధి పనులను మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజనరసింహ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదన్నారు. బీసీ సమాజం అభివృద్ధి చెందితేనే సామాజిక న్యాయం అందుతుందన్నారు. జాతీయ రహదారులపై ప్రతీ 30 కిలో మీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్, ప్రమాదాలు జరిగే బ్లాక్ పాయింట్ల వద్ద ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అవి ఈ ఏడాది అందుబాటులోకి వస్తాయన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే మక్తల్ నియోజకవర్గం వెనుకబాటుకు గురైందన్నారు. జీఓ 69, 14 ద్వారా మక్తల్, నారాయణపేట, కొడంగల్ లిఫ్టిరిగేషన్ పూర్తి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లో 94 లక్షల చేపపిల్లలు వదులుతామన్నారు. అంతకు ముందు సంగంబండ ప్రాజెక్టు, పెద్ద చెరువులో మంత్రులు చేప పిల్లలను వదిలారు. కోనేరు ఆధునీకరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఈర్లపల్లి శంకర్, రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, చిత్రంలో ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి

మరో రెండు పర్యాయాలు ఎమ్మెల్యే అయితే
సీఎం అయ్యే అవకాశం

- స్వేచ్ఛ, అందరికీ అవకాశం కాంగ్రెస్‌లోనే సాధ్యం..
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు పర్యాయాలు ఎమ్మెల్యే అయితే సీఎం అయ్యే అవకాశం లభిస్తుందని, సామాన్య కార్యకర్త అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కేవలం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి కూడా జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో డీసీసీ అధ్యక్షుడి ఎన్నికపై శుక్రవారం అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. బాదేపల్లి బాలుర జడ్పీ హెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాలకు సీఎంను ఆహ్వానించామని చెప్పారు. ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడిగా ఎవరైనా పోటీలో ఉండొచ్చన్నారు. ఆరుగురి పేర్లను ఏఐసీసీకి పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్, ఉజ్మాఖాన్‌షాకీర్, పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర భాష, సాంస్కృతిక మండలి సభ్యులు బాదిమి శివకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, జ్యోతి పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లు ఇవ్వకుంటే
బీసీలలో తిరుగుబాటు

- కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్‌ల పేరుతో డ్రామా చేస్తోంది
- బంద్‌కు సంపూర్ణ మద్దతు
- మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో అధిక శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు ఇవ్వకుండా అసమానతలు ఏర్పడితే ఉద్యమాలు వస్తాయని, బీసీల నుంచి తిరుగుబాటు వచ్చే అవకాశం ఉందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జీఓలు ఇస్తే కోర్టులు తిరస్కరిస్తాయని, రిజర్వేషన్‌లు చట్టబద్ధతతోనే సాధ్యమని బీఆర్ఎస్ పార్టీ ఆనాడే చెప్పిందని అన్నారు. అందుకే 42 శాతం రిజర్వేషన్‌లకు చట్టబద్ధత తేవాలన్నారు. శుక్రవారం నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ డ్రామా చేస్తుందని, 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు సాధించుకునేలా అన్ని వర్గాల ప్రజలు, కుల సంఘాలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌ల సాధనలో భాగంగా నేడు నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతోపాటు బంద్‌లో పాల్గొంటామన్నారు. ఆర్టీసీ బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని, వ్యాపార, విద్యా సంస్థలు పాల్గొనాలని కోరారు. ఒక్క బీసీలే కాకుండా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రాజేశ్వర్‌గౌడ్, కేసీ నర్సింహులు, శివరాజు, గంజి ఎంకన్న, బాలరాజు, నరేందర్, తాటిగణేష్, కె ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, రాము, నవకాంత్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదం అంచున
పోతిరెడ్డి చెరువు

- కోతకు గురైన అలుగు అడుగుభాగం
- మరమ్మతు చేయించాలని గ్రామస్థుల డిమాండ్

7



జడ్చర్ల మండలం కిష్టారం గ్రామ సమీపంలో కోతకు గురైన పోతిరెడ్డి చెరువు అలుగు అడుగు భాగం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

రూ.220 కోట్లతో
తాగునీటి ఎద్దడికి పరిష్కారం

- నాసిరకం పైపులతోనే సమస్య: ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గతంలో వేసిన నాసిరకం పైపుల వల్ల అవి నిత్యం పగిలిపోవడంతో పాలమూరులో తాగునీటి సమస్య వస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అందుకే నగరంలో తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారం కోసం రూ.220 కోట్లతో కొత్త పైప్‌లైన్ వేయనున్నామని చెప్పారు. అందుకు టెండర్లు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది ఏడాదిన్నరలో పనులు పూర్తి చేస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కౌన్సిల్ గడువు అయిపోయినా ప్రతీ నెల, రెండు నెలలకోసారి అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రజలకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదివరకు నగరంలో బస్టాండ్ వద్ద ఒకే ఒక వాటర్ స్టోరేజీ పాయింట్ ఉండేదని, ఇప్పుడు నగరం నలుమూలలా నాలుగు స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ముందుగా వీరన్నపేట వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. 2047 వరకు పెరగనున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. నగరంలో అత్యవసర పనుల కోసం రూ.30 కోట్ల పనులకు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగిందన్నారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అస్మిత-ఖేలో ఇండియా
కిక్‌బాక్సింగ్ సిటీలీగ్

పాల్గొననున్న 300 మంది క్రీడాకారులు



ఇండోర్ స్టేడియంలో టోర్నీకి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

- ఏర్పాట్లు పూర్తి
- పరిశీలించిన మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత-ఖేలో ఇండియా కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్ టోర్నీని శనివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, రవినాయక్ శుక్రవారం పరిశీలించారు. టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు జగిత్యాల, రంగారెడ్డి, హైదరాబాద్, సిరిసిల్ల జిల్లాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని, సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. విజేతలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. పోటీలకు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.



కోయిలకొండ ఖిల్లా ప్రధాన ద్వారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కోయిలకొండ ఖిల్లా అద్భుతం

- కలెక్టర్ విజయేందిర బోయి

కోయిలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి కోయిలకొండ ఖిల్లా అద్భుతంగా ఉందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కోయిలకొండ ఖిల్లాను కలెక్టర్ సందర్శించారు. పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ వర్మ తన ప్రసంగంలో కోయిలకొండ ఖిల్లా కట్టడాలు, చరిత్ర గురించి చెప్పడంతో కోటను సందర్శించినట్లు చెప్పారు. నాడు రాజులు నిర్మించిన కట్టడాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయన్నారు. ఖిల్లా ప్రధాన ద్వారం, గోలుసును కలెక్టర్ పరిశీలించారు. కోట చరిత్ర గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖిల్లాను అభివృద్ధిను చేసేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు కలెక్టర్ మండలంలోని అనంతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, తహసీల్దార్ రాజా గణేష్, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, సూపర్‌డెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

31 నుంచి పాదయాత్ర

- వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో భాగంగా: ఎంపీ అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి వేడుకల సందర్భంగా ఈనెల 31 నుంచి వచ్చే నెల 25 వరకు జిల్లా స్థాయి పాదయాత్రలు నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మూడు రోజులు పాటు 8 నుంచి 10 కిలో మీటర్ల మేర పాదయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత భారత్ పై యువతతో ప్రతిజ్ఞ చేయించనున్నట్లు తెలిపారు. నవంబరు 26 నుంచి డిసెంబరు 6 వరకు జాతీయ స్థాయిలో పాదయాత్ర ఉంటుందని, పాల్గొనే యువత పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 118.00
హోల్ సేల్	: 121.00
డ్రెస్డ్	: 203.00
స్కిన్ లెస్	: 231.00

నేటి నుంచి 69వ రాష్ట్రస్థాయి
ఎస్‌జీఎఫ్ వాలీబాల్ టోర్నీ

- రాజాపూర్ మండలం తిరుమలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు
- పాల్గొననున్న ఉమ్మడి 10 జిల్లాల జట్లు

7



టెండర్లు వేస్తున్న వ్యాపారులు

ఆఖరి రోజుపైనే ఆశలు!

- నేటితో ముగియనున్న మద్యం టెండర్లు
- పాల్గొనని ఏపీ వ్యాపారులు
- ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 2,735

6

సర్వం సమ్మతమే..

(5వ పేజీ తరువాయి)

సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. కాంగ్రెస్ ఇప్పటికే బీసీ బంద్ విజయవంతం చేయాలని పిలుపునివ్వగా.. బీజేపీ కూడా సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ కూడా బీసీ బంద్‌లో తమ నాయకులు పాల్గొనాలని కేడర్‌కు సూచించింది. అలాగే బీసీ సంఘాలు ఇప్పటికే ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడ్డాయి. అన్ని కుల, ప్రజా సంఘాలు బేషరతుగా మద్దతును ప్రకటించాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు శనివారం సెలవును ప్రకటించుకున్నాయి. విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు కూడా బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించాయి. బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బీసీ సమాజ్, బీసీ సంక్షేమ సంఘం, బీసీ పొలిటికల్ జేఏసీ, బీసీ ఫ్రంట్ ఇలా అన్ని సంఘాలు ర్యాలీలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, చర్చా వేదికలను నిర్వహించాయి. బీసీ బంద్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కుల సంఘాలు కూడా పాల్గొంటున్నట్లు ప్రకటించాయి.

చేపల వలలో మొసలి కలకలం

» సురక్షితంగా బంధించిన కృష్ణసాగర్



బీట్ ఆఫీసర్ గౌతమ్‌కు మొసలిని అప్పగిస్తున్న సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ సాగర్

పాన్‌గల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాన్‌గల్ మండల పరిధిలోని మహమ్మదాపూర్ కేశన్న కుంటలో మత్స్యకారుల చేపల కోసం వేసిన వలలో మొసలి చిక్కినట్లు గ్రామస్థులు, మాజీ సర్పంచ్ జయరాములు సాగర్ తెలిపారు. గత కొన్ని రోజులుగా గ్రామ సమీపంలోని కేశన్న కుంటలో రెండు మొసళ్లు సంచరిస్తున్నాయని గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ సాగర్‌కు సమాచారం అందించారు. ఆయన రెండు పర్యాయాలు చెరువు దగ్గరకు వచ్చి మొసళ్లను బంధించేందుకు ప్రయత్నించి విఫలం చెందారు. కుంటలో నీళ్లు ఎక్కువగా ఉన్నందువల్ల సాధ్యం కాలేదు. కృష్ణ సాగర్ సూచనల మేరకు చేపల కోసం వల్ల వేయడంతో మొసలి చిక్కింది. దీంతో వెంటనే కృష్ణసాగర్ తన మిత్రుడు కుమార్‌తో కలిసి గ్రామానికి చేరుకుని మొసలిని సురక్షితంగా బంధించారు. మొసలిని బీట్ ఆఫీసర్ గౌతమ్‌కు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

మహమ్మదాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్లలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాస్‌గౌడ్ (55) తన పని నిమిత్తం ఈనెల 13న ద్విచక్ర వాహనంపై పరిగి ప్రధాన రహదారిపై గాధిర్యాల సమీపంలో వెళ్తున్నాడు. హన్వాడ మండలం గుడిమల్కాపూర్‌కు చెందిన దాసరి యాదయ్య తన ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వెనకనుంచి ఢీకొనడంతో శ్రీనివాస్ గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రోజు ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

బుడ్డియానాయక్ తండాకు చెందిన వ్యక్తి..

తిమ్మాజిపేట,(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామపంచాయతీ బుడ్డియానాయక్‌తండాకు చెందిన మూడావత్ శంకర్(35) అనే యువకుడు గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవాబ్‌పేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల గేటు సమీపంలో వేగంగా వచ్చిన ఓ కారు చెట్టును ఢీకొట్టడంతో అందులో ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌కు చెందిన ఖాజ తను నడుపుతున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

ఆటోమొబైల్ షాప్ దగ్ధం

» లక్షలాది రూపాయల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న రెడ్డి ఆటోమొబైల్ షాప్

కొల్లాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కోడేరు మండలంలోని ఎత్తం గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి గతంలో పట్టణంలోని అపోలో మెడికల్ షాప్ సమీపంలో ఆటోమొబైల్ దుకాణం నిర్వహించేవాడు. ఇటీవలే ఆ షాప్‌ను నాగర్‌కర్నూల్ రహదారిలో మాధవస్వామి దేవాలయం సమీపంలోని నిర్మించిన కొత్త భవనంలోకి మార్చాడు. పనుల్లో భాగంగా షాప్‌లో వెల్డింగ్ చేస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో నిప్పురవ్వలు పక్కనే ఉన్న ఆయిల్ డబ్బాలపై పడటంతో మంటలు చెలరేగాయి. క్షణాల్లో దుకాణం మొత్తం వ్యాపించడంతో లక్షలాది రూపాయలకు పైగా విలువైన విడిభాగాలు, పరికరాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయింది. అలాగే మంటలు మొదటి అంతస్తుకు కూడా వ్యాపించడం నష్ట తీవ్రత అధికం అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేసేందుకు అగ్నిమాపక సిబ్బంది గంటల కొద్దీ శ్రమించాల్సి వచ్చింది. లక్షలాది రూపాయల ఆస్తి నష్టం సంభవించడంతో యజమాని రాజశేఖర్‌రెడ్డి కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆఖరి రోజుపైనే ఆశలు..!



మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు వచ్చిన వ్యాపారులు

జిలా దరఖాస్తులు	16 వరకు	17న	మొత్తం
గద్వాల	233	234	467
వనపర్తి	120	174	294
నాగర్‌కర్నూల్	256	412	668
మహబూబ్‌నగర్	396	487	883
నారాయణపేట	206	217	423
మొత్తం	1211	1524	2735

» నేటితో ముగియనున్న మద్యం టెండర్లు

» పాల్గొనని ఆంధ్ర వ్యాపారులు

» అప్లికేషన్ ఫీజు రూ.3 లక్షలు..

» ఇప్పటివరకు 2735 టెండర్లు.. ఇందులో ఒక్కరోజే 1524

మహబూబ్ నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం టెండర్లకు గతంలో కన్నా ఈసారి ఎక్కువ సమయం ఇచ్చినా వ్యాపారులు అంతగా ఆసక్తి కనబరచడం లేదు.. నిన్న, మొన్న టెండర్లలో కాస్త జోరు కనిపించినా క్రితంసారి నమోదైన సంఖ్యను చేరుకుంటుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేటితో టెండర్ల ప్రక్రియ పూర్తవనుంది. చివరిరోజైన శనివారం భారీ సంఖ్యలో టెండర్లు వస్తాయని... గతేడాది నమోదైన దరఖాస్తుల సంఖ్యను చేరుకుంటామని ఎక్సైజ్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది కూడా చివరిరోజే పెద్దఎత్తున దరఖాస్తులు రాగా, ఈసారి కూడా అదేస్థాయిలో వస్తాయని భావిస్తున్నారు. కాగా శుక్రవారం టెండర్ల సంఖ్య పెరిగింది. ఒక్కరోజే ఉమ్మడి జిల్లాలో 1524 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు మొత్తం 2735 టెండర్లు వచ్చాయి. చివరి రోజు 5 వేల దరఖాస్తులు వస్తాయని బావిస్తున్నా ఏమేరకు వస్తాయో చూడాలి.

కనిపించని ఆంధ్ర వ్యాపారులు

ఈసారి టెండర్లు వేయడానికి ఆంధ్ర వ్యాపారులు ఆసక్తి కనబరచలేదు. ఇదివరకు కర్నూల్, అనంతపూర్, గుంటూరు, విజయనగరం, విజయవాడ నుంచి వ్యాపారులు వచ్చి పెద్దసంఖ్యలో టెండర్లు వేసేవాళ్లు. ఈ ఏడాది అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. టెండర్ల సంఖ్య తగ్గడానికి ఇది కూడా కారణంగా ఉంది. ఏపీలో ఇదివరకు జగన్ సర్కార్ ప్రభుత్వమే మద్యం దందా చేయడంతో వ్యాపారులు పెద్దమొత్తంలో తెలంగాణకు వచ్చి వ్యాపారం చేసే వాళ్లు. ఈ ఏడాది చంద్రబాబు సర్కార్ మద్యం దుకాణాలకు టెండర్లు వేయడంతో వ్యాపారులు అక్కడే వ్యాపారం చేసుకుంటుండటంతో ఇక్కడికి రావడానికి అంత ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. దీనికి తోడు ఈసారి అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడంతో చిన్నచిన్న వ్యాపారులు ముందుకురావడం లేదని తెలుస్తోంది. ఇదివరకు రూ.2 లక్షలు ఉన్నప్పుడు ఐదారుముంది సిండికేట్‌గా మారి టెండర్లు వేసేవాళ్లు. ఇప్పుడే ఒక దుకాణం రాకపోయినా రూ.3 లక్షలు పోతాయని పలువురు ధైర్యం చేయడం లేదు. ఇక మద్యం టెండర్లు, స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి రావడం ఆ ప్రభావం టెండర్లపై పడినట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు కూడా ఖరారు అయ్యాయి. తమకు అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చిన చోట పోటీ చేయాలకుంటున్న నాయకులు ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు ఇప్పటికే నిధులు సమకూర్చుకునే పనిలో ఉన్నందున టెండర్లవైపు చాలామంది రావడం లేదు. వీటికితోడు రియల్ దందా కూడా రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల రియల్టర్లు కూడా టెండర్ల విషయంలో ఉత్సాహం చూపించడం లేదు. కొత్త మద్యం పాలసీలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. అయినా టెండర్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం గమనార్హం.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల పాటు సేల్స్ విపరీతంగా ఉంటాయి. వీటి అనంతరం మునిసిపల్ ఎన్నికలు కూడా రానున్నాయి. వరుసగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనైనా ఈ ఏడాది గతంలో కన్నా టెండర్లు పెరుగుతాయని అధికార యంత్రాంగం అంచనా వేసింది. అయితే చివరిరోజు పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం లేకపోలేదు. గత ట్రాక్‌రికార్డ్ పరిశీలిస్తే చివరిరోజే వేలల్లో దరఖాస్తులు వచ్చిన సందర్భాలున్నాయి. నేటితో టెండర్ల ప్రక్రియ ముగియనున్నందున శనివారం పొద్దుపోయేవరకు టెండర్ల ప్రక్రియ సాగనుంది.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

» ఒక కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి

గద్వాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిపోయింది. శ్రీశైలం ప్రాజెక్టు శుక్రవారం వరద మరింత తగ్గి, 21 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. కుడి వైపు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని నిలిపివేశారు. ఎడమ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొన సాగిస్తూ, 35,315 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 202.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు కూడా మూత పడటంతో, జూరాలకు 33 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చి చేరుతున్నది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 36,385 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 2 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

కురుమూర్తి రాయుడికి పట్టు వస్త్రాల నేత

» అమరచింతలో పట్టు వస్త్రాల ముడి సరుకులకు ప్రత్యేక పూజలు



అమరచింతలో కురుమూర్తి రాయుడి పట్టు వస్త్రాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పద్మశాలీలు

అమరచింత, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో కురుమూర్తి రాయుడికి పట్టు వస్త్రాల నేత పనిని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కండేయ ఆలయంలో కురుమూర్తి ఆలయ ప్రత్యేక అర్చకుల మధ్య స్వామి వారి పట్టు వస్త్రాలకు వాడే ముడి సరుకైన నూలు, జలతారు, రేషం, కండెలు, తదితర ముడి సరుకుతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక మగ్గానికి పూజలు చేశారు. అనంతరం ఆనవాయితీగా ప్రతీ ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కురుమూర్తి రాయుడికి పట్టు వస్త్రాల నేత పనిని అమరచింత పద్మశాలీలు ప్రారంభించారు. మొదటి రోజు నేత పనిని పగడాకుల కూర్మన్న దంపతులు మగ్గంపై కూర్చుని నేత పనిని ప్రారంభించగా... ప్రతీ రోజు నిష్టతో ఆనవాయితీగా పద్మశాలీ సంఘం వారు నిర్ణయించిన వారు కొనసాగిస్తారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమై బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26వ తేదీన మొదటి ఘట్టమైన కురుమూర్తి స్వామి అలంకార మహోత్సవం రోజు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి కాంచన గుహలోని శ్రీ కురుమూర్తి రాయుడికి సమర్పించనున్నారు.

కురుమూర్తి స్వామి దేవాలయ ప్రత్యేక పూజారి సత్య నారాయణ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలు ఆలయ కమిటీ చైర్మన్ గౌని గోవర్ధన్‌రెడ్డి, ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు దేవరకొండ లచ్చన్న, సత్తన్న, తాటికొండ విజయ్, మేర్వ రాజు, క్యామ భాస్కర్, తాటికొండ రమేష్, మహంకాళి చంద్రమోహన్, క్యామ శ్రీనివాసులు, సిద్ధ రాములు, సత్యనారాయణ, పాండు తదితరులు పాల్గొన్నారు.

'కురుమూర్తి' దారిలో పొంచిఉన్న ప్రమాదం

» ఊకచెట్టు వాగుపై అసంపూర్తిగా హైలెవల్ వంతెన

» రక్షణ గోడలు లేకపోవడంతో ప్రజల ఆందోళన



రక్షణ గోడలు లేని హై లెవెల్ వంతెన

చిన్నచింతకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండల కేంద్రం మీదుగా కురుమూర్తి ఆలయానికి వెళ్లే దారిలో ఊకచెట్టు వాగుపై నిర్మించిన హై లెవెల్ వంతెనకు రక్షణ గోడలు నిర్మించలేదు. సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ అంధకారం అలుముకుంటోంది. వంతెనకు అనుబంధంగా ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు అంచులకు వేసిన మట్టికట్ట వర్షనీటితో కోతకు గురైంది. కురుమూర్తి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇదే రహదారి గుండా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయి. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కొత్తకోట, వనపర్తి, కర్నూల్, నారాయణపేట, నర్వ, మక్తల్, రాయచూర్ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఇదే హై లెవెల్ వంతెన మీదుగా వెళ్తుంటాయి. వంతెన నిర్మాణంవల్ల వాహనాల రాకపోకలకు భక్తులకు సౌలభ్యం కలుగుతున్నా, రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత బ్రహ్మోత్సవాల సమయంలో జాతరకు వచ్చే సమయంలో ఓ కారు వంతెనపై నుంచి కిందకు బోల్తాపడింది. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరుగకుండా చర్యలు తీసుకోవాలని, వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

సీఎం ఎందుకు స్పందించడం లేదు?

» డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

» మంత్రుల మధ్య లోపించిన సమన్వయం

» బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్



తమకు వేతనాలు రెగ్యులర్‌గా అందేలా చూడాలని వినతి పత్రం అందజేస్తున్న సిబ్బంది

కల్వకుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ వసతిగృహాలు, ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న దినసరి కార్మికులు 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని టీచింగ్ స్టాఫ్, తమకు క్రమం తప్పకుండా జీతాలు అందేలా చూడాలని దినసరి కార్మికులు ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు.

అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మాట్లాడుతూ ముఖ్యమంత్రితో పాటు, కల్వకుర్తి ఎమ్మెల్యే విద్యార్థుల బాగోగులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమ శాఖ మంత్రి ఉన్నాడా అని నిలదీశారు. గిరిజన బిడ్డనని చెప్పుకునే మంత్రి సీతక్క ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మంత్రుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. జుబ్లీహిల్స్ ఉప ఎన్నిక తెలంగాణ వాదులకు, తెలంగాణ ద్రోహులకు మధ్య జరుగుతోందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ఆయన వెంట నాయకులు సూర్యప్రకాశ్‌రావు, మధు, జ్యోతయ్య, రాజు, నరసింహ, శ్రీనివాసులు, సురేశ్‌గౌడ్, దారమోని గణేశ్, మాజీ సర్పంచ్ సునీల తదితరులు పాల్గొన్నారు.

స్త్రీవాద సాహిత్యానికి తగ్గుతున్న ప్రాధాన్యం

» సాహితీవేత్త డాక్టర్ మృణాళిని



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ మృణాళిని

గద్వాల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో స్త్రీవాద సాహిత్యానికి ప్రాధాన్యం తగ్గుతోందని ప్రముఖ సాహితీవేత్త, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ మృణాళిని అసంతృప్తి వ్యక్తం చేశారు. 'తెలుగు సాహిత్యంలో స్త్రీవాద కథలు, కథనాలు' అంశంపై జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1965కు పూర్వం ప్రముఖ కవులు గురుజాడ అప్పారావు, చలం వంటి వారు తమ సాహిత్యంతో స్త్రీవాదానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుకు చేశారు. అనంతర కాలంలో యద్దనపూడి సులోచనారాణి మొదలుకుని నేటి ఆధునిక రచయితల వరకు తమ కథనాల్లో స్త్రీవాదానికి ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ ఉండటం స్వాగతర్హమన్నారు. స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి జీవన విధానం, సమాజంలో వారికున్న స్థానం తదితర అంశాలను వివరించారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక కళావేదిక సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు తెలుగు సాహిత్యంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో కవితా రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్, ఆచార్య చెన్నకేశవ రెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్‌పాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మొదటి ప్రాధాన్యం

» విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేశ్

» కల్వకుర్తి గిరిజన ఆశ్రమ పాఠశాలల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేశ్

కల్వకుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేశ్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మెస్‌చార్జీలను 40 శాతం పెంచారని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్‌లతో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం చారకొండ వెంకటేశ్ మాట్లాడుతూ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని డీటీడీవో ఫిరంగికి సూచించారు. ఆయన వెంట నాయకుడు పుస్తకాల రాహుల్ ఉన్నారు.

టీఎల్ఎం మేళాతో సృజనాత్మకత పెంపు

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» రాష్ట్రస్థాయికి తొమ్మిది ప్రాజెక్టుల ఎంపిక



బోధనా సామగ్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులల్లో సృజన్మాకతను పెంపొందించేందుకు టీఎల్ఎం మేళా ఎంతో అవసరమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు అయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉపాధ్యాయులు రూపొందించి, ప్రదర్శించిన బోధనా సామగ్రిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లోని క్లిష్టమైన విషయాలను ఉపాధ్యాయులు వినూత్నంగా రూపొందించిన బోధనా సామగ్రితో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. డీఈవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతు ఉపాధ్యాయులు తమ సృజనాత్మక నైపుణ్యాలను ఉపయోగించి తయారు చేసి. బోధనా సామగ్రిని ఇతరులతో పంచుకోవడానికి ఈ మేళా వేదికగా మారిందన్నారు. మేళాలో 169 బోధన ఉపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో సుధాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ఎంఈవోలు లక్ష్మణ్‌సింగ్, మంజులాదేవి, రాజునాయక్, జనార్దన్, మురళీకృష్ణ, నాగ్యానాయక్, పలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతప్ప, జగదీశ్‌కుమార్, సంఘాల నాయకులు మదన్‌మోహన్‌మాధవ్, సుధకార్‌రెడ్డి, కృష్ణుడు, రవికుమార్, వెంకటేశ్, శ్యాంబాబు, బాబునాయుడు, సురేంద్రనాథ్, తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన పాఠశాలలు

తెలుగు విభాగంలో మొదటి బహుమతిని మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి యూపీఎస్, రెండవ బహుమతిని మహమ్మదాబాద్ మండలంలోని సంఘమాయపల్లి తండా ప్రాథమిక పాఠశాలలకు లభించాయి. ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతిని మహబూబ్‌నగర్ మండలంలోని చౌదర్‌పల్లి ప్రాథమిక పాఠశాల, రెండవ బహుమతిని జడ్చర్ల మండలంలోని చిన్నపల్లి ప్రాథమిక పాఠశాల సాధించాయి. పరిసరాల విజ్ఞానం విభాగంలో ప్రథమ బహుమతిని నవాబ్‌పేట మండలంలోని చెన్నారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, రెండవ బహుమతిని ఆర్ఎన్‌జీ తండా పొందాయి. గణిత విభాగంలో ప్రథమ బహుమతిని నవాబ్‌పేట మండలంలోని కూచూరు ప్రాథమిక పాఠశాల, రెండవ బహుమతిని భూత్పూర్ మండలంలోని హస్నాపూర్ యూపీఎస్, ఉర్దూ విభాగంలో మహబూబ్‌నగర్ న్యూటౌన్ ప్రభుత్వ పాఠశాల దక్కించుకున్నాయి.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

రేవల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :రేవల్లి మండల కేంద్రంలో పది రోజుల క్రితం అదృశ్యమైన శేఖర్ (33)మృతదేహం శుక్రవా రం రేవల్లి గ్రామ శివారులో మాదరమని పుల్లయ్య మొక్కజొన్న పంట పొలాల్లో పక్కన మద్యం సీసా పంటకు వాడే రసాయన మందు డబ్బా దొరికినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకై వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శేఖర్ భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు సంఘటన స్థ లంలో క్లూస్ టీంతో దర్యాప్తు నిర్వహించినట్లు ఎస్ఐ రజిత తెలి పారు. మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్రైం కార్నర్

వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి



నడిపి శాలు(ఫైల్)

బోల్తా పడిన ట్రాక్టర్ వద్ద మృతదేహాన్ని తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

రాజోలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన రాజోలి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గోకారి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన రాజోలి గ్రామానికి చెందిన పింజరి నడిపి శాలు(47) తన సొంత ట్రాక్టర్‌కు వాటర్‌ట్యాంకు తగిలించుకుని ముండ్లదిన్నె గ్రామంలో శుభకార్యానికి అని వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. చుట్టుపక్కల పొలాల్లో ఉన్న కూలీలు గమనించి సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ కింద పడి ఉన్న వ్యక్తిని బయటకి లాగారు. మృతుడు నడిపిశాలు అని గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా ట్రాక్టర్ మృతుడిపై పడటంతో ఉపిరాడక అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం పోలీసు సిబ్బంది శ్రీనివాసులు, రాఘవేంద్రబాబు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న టిప్పర్‌ను తనిఖీ చేశారు. అందులో ఇసుక ఉండటంతో డ్రైవర్ నరేంద్రను విచారించగా అనుమతులు లేకుండా పుల్లూరు వైపు నుంచి హైదరాబాదుకు రవాణా చేస్తున్నట్లు తెలుపడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

బోరు మోటార్ వైరు చోరీపై ఫిర్యాదు

వనపర్తి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బోరు మోటార్ వైరును ఈనెల 15న వనపర్తి మండలం చిట్యాల శివారులోని వ్యవసాయ పొలంలో దుండగులు దొంగిలించినట్లు రైతు వెంకటయ్య శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వనపర్తి మండలం చిట్యాల గ్రామానికి చెందిన వెంకటయ్య తనకున్న వ్యవసాయ పొలంలో ఈనెల 15న బోరు మోటార్ చెడిపోవడంతో వనపర్తి మండలం అప్పాయిపల్లి గ్రామానికి చెందిన కూలీలతో చెడిపోయిన బోరు మోటార్‌తో సహ వైరును బయటకు తీశారు. వైర్లు అక్కడే పెట్టి బోరు మోటార్‌ను మాత్రం రిపేరు కోసం వనపర్తికి తీసుకువెళ్లారు. మరుసటి రోజు బోరు మోటార్‌ను రిపేరు చేయించుకుని తిరిగి వ్యవసాయ పొలంలో ఉన్న బోరు బావి దగ్గరికి వచ్చారు. బోరును బావిలో దింపేందుకు చూడగా అక్కడే ఉంచిన వైరు కనిపించలేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారంటూ అనుమానంతో రైతు వెంకటయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



పర్వతాలు(ఫైల్)

రేవల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏదుల మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన గంగనమోని పర్వతాలు (38)తలుపునూరు గ్రామ శివారులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పర్వతాలు గురువారం ఉదయం దాదాపు 8 గంటల సమయంలో ఇంట్లో గొడవపడి తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటికి వచ్చాడు. ఎంత వెతికినా కుటుంబ సభ్యులకు ఆచూకీ లభించలేదు. రాములు అనే వ్యక్తి గురువారం మండల పోలీస్ స్టేషన్‌లో తన అన్న పర్వతాలు కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు ఎస్ఐ రజిత కేసు నమోదు చేశారు. శుక్రవారం తలుపునూరు గ్రామ శివారులో గల డీ-8 కాలువ పక్కన ఒక ద్విచక్ర వాహనాన్ని చూసిన బాటసారులకు వాహనం దగ్గరికి వెళ్లి చూడగా పక్కనే కానుగ చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి చేరుకొని మృతదేహం పర్వతాలుగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలో ఉన్న రేషన్ బియ్యం

మదనాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనాపురం మండల కేంద్రంలో ఆటోలో అక్రమంగా ఉన్న రేషన్ బియాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పట్టణానికి చెందిన ఎరుకలి వెంకటేష్ తన ఆటోలో తరలించడానికి వెళ్తున్నాడనే సమాచారం అందుకొని సుమారు 35 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. దీనిపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ కంచె తగిలి..



సంజీవయ్య (ఫైల్)

రేవల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రేవల్లి మండలంలోని కొంకలపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై సంజీవ (54)మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు... కొంకలి సంజీవ లక్ష్మి దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు. సంజీవ తన భార్య లక్ష్మితో పాటు కలిసి పౌల్ట్రీ ఫామ్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చిన సంజీవ రేవల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. కొంకలపల్లి గ్రామానికి గల పొలిమేర పాతబాట గుండా వస్తున్న సంజీవ అదే గ్రామానికి చెందిన బాషా అనే రైతు పొలానికి పెట్టిన విద్యుత్ కంచెకు తగిలి విద్యుదాఘాతానికి గురై మరణించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం కొరకై రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ఊర్కొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో వారం క్రితం 3 మొబైల్స్ చోరీకి గురైనట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. దీంతో బాధితులు ఊర్కొండకు చెందిన సందీప్‌కుమార్, అన్వర్‌పాష, మాదారం గ్రామానికి చెందిన నెరడి చెన్నయ్యలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్నామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్స్ గుర్తించి బాధితులకు ఊర్కొండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అందించామని ఎస్ఐ పేర్కొన్నారు. ఏఎస్ఐ అంజన్‌రావు సిబ్బంది ఉన్నారు.

చోరీకి యత్నిస్తూ పట్టుబడిన యువకుడు

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్‌ను చోరీకి యత్నించిన ఓ యువకుడిని ఆర్టీసీ సెక్యూరిటీ లింగంపేట నర్సిములు పట్టుకున్న సంఘటన జడ్చర్ల న్యూబస్టాండులో శుక్రవారం చోటుచేసుకుంది. గద్వాలకు చెందిన ఓ ప్రయాణికుడు జడ్చర్లలో దిగి, అనంతరం కల్వకుర్తి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న సందర్భంలో సెల్‌ఫోన్‌ను చోరీకి యత్నించాడు. గమనించిన సెక్యూరిటీ లింగంపేట నర్సిములు, సదరు యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించాడు.

మళ్లీ 'ఉపాధి' కల్లాలు

- ఉపాధి హామీ ద్వారా నిర్మాణం
- గతంలోనే రెండేళ్ల పాటు కొనసాగింపు
- అర్ధాంతరంగా నిలిచిన పథకం



కొత్తకోట మండల కేంద్రంలో రహదారిపై ఆరబోసిన వరి (ఫైల్)

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేయడం ఒక ఎత్తు అయితే, పంట నూర్పి ఆరబోసి అమ్ముకోవడం మరో ఎత్తు. పండించిన పంటకు మార్కెట్లో సరసమైన ధర లభించాలన్నా అమ్ముడు పోవాలన్నా ధాన్యాన్ని ఆరబెట్టడం చాలా అవసరం. కానీ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి స్థలాలు కరువై రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అప్పట్లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ కొంతకాలం తరువాత అర్ధాంతరంగా ఆ పథకాన్ని నిలిపివేసింది. మళ్లీ తాజాగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగానే కల్లాల నిర్మాణం చేపట్టడానికి సమాయత్తమవుతున్నది. దీంతో జిల్లాలోని వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

● రెండేళ్లు అమలు చేసి.. అర్ధాంతరంగా నిలిపేసి..

గతంలో కొన్నేళ్ల కిందట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కల్లాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఈ పథకంలో భాగంగా కల్లాలు నిర్మించుకునే ఎస్సీ, ఎస్టీ వర్గాల రైతులకు రూ.80 వేలు, మిగతా వారికి రూ.70 వేలు సబ్సిడీలు అందించి కల్లాలు నిర్మించే అవకాశం కల్పించారు. దీంతో చాలా మంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు వచ్చారు. ఈ పథకం నిలిపివేసే నా టికి జిల్లాలో 2053 మంది రైతులు కల్లాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో 204 కల్లాల నిర్మాణం కూడా పూర్తయిపోయింది. మరో 942 కల్లాలు నిర్మాణ ప్రక్రియలో వివిధ దశలలో ఉండిపోయాయి. హఠాత్తుగా ఈ పథకాన్ని నిలిపివేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఫలితంగా రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కొందరు రైతులు కల్లాల నిర్మాణం కోసం ముగ్గులు పోసి పునాదులు తీసి మధ్యలోనే ఆపేసే పరిస్థితి ఏర్పడింది. తాజాగా కేంద్రం మళ్లీ ఈ పథకాన్ని పునరుద్ధరించి పంట కల్లాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చే అవకాశం ఉందనే వార్తలు రైతుల్లో కొత్త ఆశలు రేపుతున్నాయి.

● తీరనున్న ఆరబోత కష్టాలు

రైతు పదుల ఎకరాలలో పంట పండించిన ధాన్యాన్ని ఆరబోయడానికి కాస్తంత ఖాళీ స్థలం లేకపోతే ఎదురయ్యే సమస్యలు అంతా ఇంతా కాదు. పండించిన పంటను వ్యయ ప్రయాసాల కోర్చి ఎక్కడో దూరంగా ఉన్న రహదారుల మీదికి చేర్చాల్సి వస్తుంది. రహదారులపై ధాన్యాన్ని విస్తరించి ఎండబెట్టాల్సి వస్తోంది. ఈ ప్రక్రియ చివరికి రోడ్డు ప్రమాదాలకు కూడా దారితీస్తోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాహనదారులకు అది పెద్ద ముప్పుగా పరిణమిస్తోంది. జరగరాని సంఘటనలు జరిగితే ఆఖరికి రైతులపై కేసులు కూడా నమోదు అవుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని అనేక గ్రామాల్లో రైతులు ఈ సమస్యతో బాధపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ధాన్యాన్ని ఆరబెట్టే ప్రక్రియ కష్టతరం కావడంతో రైతులు తమ పంటను తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్మేయాల్సి వస్తుంది. మొత్తంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మళ్లీ కల్లాల నిర్మాణం ప్రారంభించే అవకాశం కనిపిస్తుంది. వేల మంది రైతులు ఈ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

మళ్లీ పెద్దపులి ప్రత్యక్షం

- సఫారీ టూర్‌లో పర్యాటకుల సంబరం



నిజాంబంగ్లా సమీపంలో పెద్దపులి

మన్ననూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో సఫారీ పర్యటనకు వచ్చిన సందర్శకులకు పెద్దపులి కనిపించి సందడి చేసింది. అమ్రాబాద్ మండలంలోని పర్హాబాద్ చౌరస్తా నుంచి వ్యూపాయింట్ వైపు సఫారీ వాహనంలో హైదరాబాద్‌కు చెందిన పర్యాటకులు వెళుతున్న క్రమంలో శుక్రవారం ఉదయం నిజాం బంగ్లా(షికారీగర్) సమీపంలో మట్టిరోడ్డుపై నడుచుకుంటూ పెద్దపులి వెళుతూ ఉండగా, సఫారీ వాహనం డ్రైవర్ శేఖర్ వాహనాన్ని నిలిపివేయగా, పర్యాటకులు పెద్దపులి సంచారాన్ని తనివితీరా చూసి ఆనందించారు.

పెద్దపులి సంచారం వీడియోను తమ సెల్‌ఫోన్లలో వీడియోలు చిత్రీకరించుకున్నారు. ఇట్టి వీడియో అటవీ శాఖకు చెందిన వాట్సాప్ గ్రూపులో పెట్టి అటవీ అధికారులు ధ్రువీకరించారు.

ప్రత్యేక కార్యాచరణతో కేసుల ఛేదన

- జోగుళాంబ రేంజ్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- డీఎస్పీ కార్యాలయం తనిఖీ



డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జోగుళాంబ రేంజ్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

అచ్చంపేట/ఉప్పునుంతల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక కార్యాచరణతో కేసులను ఛేదిస్తూ ప్రతీ కేసులోనూ నాణ్యమైన విచారణ చేసి బాధితులకు అండగా నిలవాలని జోగుళాంబ రేంజ్ డీఐజీ ఎల్ఎస్ చౌహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అదేవిధంగా అమ్రాబాద్, ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐలు విజయ్‌భాస్కర్, వెంకటొరెడ్డి, ఇందిరాలు ఆయనకు మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఠాణా రికార్డులను తనిఖీ చేసి విచారణలో ఉన్న కేసుల వివరాలను డీఎస్పీ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. సర్కిల్‌లోని నేరాలకు సంబంధించి సూచనలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున పోతిరెడ్డిచెరువు

- కోసుకుపోయిన అలుగు అడుగుభాగం
- ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలి



జడ్చర్ల మండలం కిష్టారం గ్రామ సమీపంలోని పోతిరెడ్డిచెరువు అలుగు మధ్యలో నుంచి వస్తున్న నీళ్లు

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల అనంతరం అలుగు పారడం, ఆ నీరంతా ప్రధాన రహదారిపైకి రావడం, ఆ వరద నీటిలో కొట్టుకుపోయిన సంఘటన జరిగిన పోతిరెడ్డిచెరువు ప్రస్తుతం ప్రమాదం అంచున ఉంది. అలుగు అడుగు భాగం కోసుకుపోయింది. జడ్చర్ల మండలం కిష్టారం గ్రామ సమీపంలోని పోతిరెడ్డిచెరువు అలుగుకు ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది.

జడ్చర్ల మండలంలోని పోలేపల్లి నుంచి కిష్టారం వెళ్లే దారిలోని పోతిరెడ్డి చెరువుకు మూడు సంవత్సరాల అనంతరం అలుగు పెద్ద ఎత్తున పారింది. అలుగు అడుగు భాగం సుమారు ఒక ఫీటు మేర కోతకు గురయ్యింది. అలుగు కుంగిపోతే అలుగు మొత్తం కూలిపోయే ప్రమాదం నెలకొని ఉంది. అలుగు మధ్య భాగంలో సైతం నిర్మాణంలో ఉపయోగించిన రాళ్లు సైతం ఊడిపోయేవిధంగా ఉండడం, మొక్కలు పెరగడంతో ప్రమాదకరమైన పరిస్థితి నెలకొంది. అలుగు అడుగు భాగంలో నుంచి సైతం నీళ్లు వస్తుండడంతో పోలేపల్లి, కిష్టారం గ్రామాల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. వెంటనే ఇరిగేషన్‌శాఖ అధికారులు పోతిరెడ్డిచెరువు అలుగును పరిశీలించి, మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. అలుగు కుంగిపోతే చెరువులో ఉన్న నీళ్లన్ని వృధా కావడంతో పాటు పంట, పొలాలకు వస్తాయని, పంటలు నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోతిరెడ్డిచెరువు అలుగు అడుగు భాగం కోతకు గురైన విషయాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి దృష్టికి గ్రామస్థులు, రైతులు తీసుకెళ్లారు. వెంటనే చెరువును పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు శుక్రవారం పోతిరెడ్డి చెరువును పరిశీలించారు. అలుగు అడుగు భాగం కోతకు గురైనట్లుగా గుర్తించారు. మరమ్మతులు చేపడతామని అధికారులు వెల్లడించారు.

బండరాళ్ల లారీని మైనింగ్‌కు అప్పగింత

మూసాపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అడ్డాకుల మండలం కందూరు ఆలయ ఆవరణలోని గుట్టలో బండరాళ్లను పగులగొట్టి లారీలతో అక్రమంగా తరలిస్తున్నారని గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు బోయ రమేష్, పలువురు నాయకులు లారీని అడ్డుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. రెవెన్యూ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు శుక్రవారం మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో లారీలోని బండరాళ్లను కొలతలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. గత కొన్ని రోజుల నుంచి గుట్టలో బండరాళ్లను బ్లాస్టింగ్‌లకు పాల్పడుతూ అక్రమంగా మైనింగ్ దందాను కొనసాగిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. మైనింగ్ తరలించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు శిక్ష

కల్వకుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా న్యాయాధికారి విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం... కల్వకుర్తి పట్టణంలోని గాంధీ నగర్‌కాలనీకి చెందిన దాసర్ల యాదయ్య డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. శుక్రవారం అతన్ని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన యాదయ్యకు న్యాయాధికారి జె.కావ్య రెండు రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉపాధి పనులపై బహిరంగ విచారణ

- రూ.2.50 లక్షల రికవరీ, ఆరుగురికి షోకాజ్ నోటీసు

గద్వాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన ఉపాధి పనులపై శుక్రవారం ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఇటిక్యాల మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉండగా గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు నిర్వహించిన 7.32కోట్ల పనులపై ఆడిట్ నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ముత్తయ్య ఆధ్వర్యంలో 10రోజుల పాటు గ్రామాల్లో అతర్గత ఆడిట్ నిర్వహించారు. అదేవిధంగా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రూ.97లక్షల నిధులపై కూడా ఆడిట్ నిర్వహించారు. వీటన్నింటిపై జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు బహిరంగ విచారణ నిర్వహించారు. రాత్రి 8గంటల వరకు 26 గ్రామాల బహిరంగ విచారణ నిర్వహించారు. మొత్తం రూ.2.55లక్షల రికవరీలు, ఫైన్‌లు వేశారు. ఉపాధి నిబంధనలు పాటించకుండా పనులు నిర్వహించిన ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇంకా మూడు గ్రామాలపై ఆడిట్ కొనసాగుతున్నది. ఉపాధి పనుల బహిరంగ విచారణలోని అంశాలను పూర్తిస్థాయిలో శనివారం వెల్లడిస్తామని వారు తెలిపారు. ఎంపీడీవో అజార్ మోహినుద్దీన్, ఎర్రవల్లి ఎంపీడీవో రశీద్ అహ్మద్, ఏపీడీ శ్రీనివాస్, ఏపీవో శివజ్యోతి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 69వ రాష్ట్ర స్థాయి

ఎస్‌జీఎఫ్ వాలీబాల్ టోర్నీ



ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

రాజాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిరుమలాపూర్ గ్రామాల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి 69వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18,19,20 తేదీల్లో తెలంగాణలో ఉన్న ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన విద్యార్థులు 10 టీంలు పాల్గొంటారని పేర్కొన్నారు. అక్కడ ప్రతిభ కనబర్చిన 12 మందితో కూడిన ఒక జట్టును ఎంపిక చేసి జాతీయ స్థాయికి పంపించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి తెలియజేశారు.

వారు నవంబరు 13,14,15 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఇక్కడ జరిగే పోటీలకు అధికారుల సహకరంతో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొననున్న సూమరు 200 మంది విద్యార్థులకు అందరికీ అన్ని వసతులతో కూడిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి సుధాకర్, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు పేర్కొన్నారు.

విజేతగా నిలవాలి

- ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ శారదాబాయి



ఉమ్మడి జిల్లా బాలికల వాలీబాల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాలీబాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ సెక్రటరీ డాక్టర్ శారదాబాయి అన్నారు. నేటి నుంచి 20వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల జట్టు, బాలుర జట్టు ఎంపికలను శుక్రవారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌బాబు, రాంచందర్, బాలు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలికల జట్టు వివరాలు...

ఐశ్వర్య, సింధు, రిషిత, అనూష శిరీష, దస్తమ్మ, స్వాతి, దివ్య, శ్రీవాణీ, సింధు ఇందు, శృతి

ఆర్టీసీలో లక్కీ డ్రా

- విజేతలకు బహుమతుల ప్రదానం



లక్కీ డ్రా విజేతలకు ఆర్ఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న ఆర్ఎం సంతోష్‌కుమార్

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలుగా నిల్చిన వారికి శుక్రవారం మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం.సంతోష్‌కుమార్ నగదు బహుమతి అందజేశారు. మొదటి బహుమతికి ఎంపికైన కె. శివశంకర్ గత నెల 30న ఎంజీబీఎస్ నుంచి బిజినేపల్లికి ప్రయాణం చేశారు. రెండవ బహుమతి పొందిన కావలి బాలమణి(బిందు) ఎంజీబీఎస్ నుంచి మహబూబ్‌నగర్‌కు ఈ నెల 4న ప్రయాణం చేశారు. మూడో బహుమతి పొందిన మోక్షజ్ఞ కర్నూల్ నుంచి జడ్చర్లకు ఈ నెల 4న ప్రయాణం చేశారు.

మొదటి బహుమతి పొందిన శివశంకర్‌కు 25 వేల రూపాయల విలువ గల చెక్కును, రెండవ బహుమతికి ఎంపికైన బాలమణి (బిందు)కు 15 వేల రూపాయల విలువగా చెక్కును, మూడో బహుమతికి ఎంపికైన మోక్షజ్ఞకు 10 వేల రూపాయల విలువగల చెక్కును ఆర్ఎం.సంతోష్ కుమార్ అందించారు. వీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ ఒక్కరు ఆర్టీసీ సేవలకు వినియోగించుకోవాలని కోరారు. డీవీఎంలు కవిత, లక్ష్మీధర్మ, ఉమ్మడి జిల్లాకు చెందిన డిపో మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్లు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం.. రూ.17 వేలు హాంఫట్

ఊర్కొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఊర్కొండ మండల కేంద్రంలో జీవనోపాధి పొందుతున్న తిరుపతయ్య బ్యాంకు ఖాతాలో నుంచి రూ.17,078 సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధిత తిరుపతయ్య తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ ఈసీఐఎల్ చిన్నపాటి స్వగృహం ఉందని అన్నారు. బంధువులందరు ఇక్కడే ఉండటంతో జీవనోపాధి నిమిత్తం మండల కేంద్రంలో నివాసం ఉంటూ చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నామని తెలిపారు. రోజువారీగా షాపులో ఉండగా ఫోన్ రావడంతో మాట్లాడుతుండగా ఇంటి నల్లా బిల్లు రూ.12/- చెల్లించాలి, ఈరోజే చివరి తేదీ, నల్లా కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించడంతో ఆందోళన చెందిన భార్య భర్త తిరుపతయ్యకు తెలిపింది. వెంటనే ఫోన్ తీసుకొని ఫోన్‌పే ద్వారా వారు అడిగిన మొబైల్ నంబరుకు రూ.12 పంపించిన వెంటనే ఖాతాలో ఉన్న రూ.17,078 డ్రా అయినట్లు మెసేజ్ చూసిన వెంటనే అవాక్కయ్యాడు. దీంతో వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబరు 1930కు కాల్ చేశామని, అనంతరం పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

పీయూ లా కళాశాలలో ఎల్‌ఎల్‌ఎం ప్రవేశాలు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూర్సిటీలోని లా కళాశాలలో ఎల్ఎల్ఎం ప్రవేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి దశ కౌన్సెలింగ్‌లో ప్రభుత్వం 20సీట్లు మంజూరు చేయగా, మొదటి సీటు పొందిన రవీందర్‌కు ప్రిన్సిపాల్ మాలవి, వైస్ ప్రిన్సిపాల్ భూమయ్య అలాట్మెంట్ కాపీని అందజేశారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీ ఎన్నిక

భూత్పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని తాటికొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ టీఎస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మధన్‌మోహన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శి కృష్ణ కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదయ్య, శశిధర్, సాయిరాంగౌడ్, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, సత్తూరు బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఏవో సువర్ణరాజుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో సుమారు 80లక్షల మెట్రిక్ టన్నుల కంటే అధికంగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. శ్యాంసుందర్‌రెడ్డి, ఫారుక్, ముచ్చర్ల కృష్ణయ్య, మురళీకృష్ణ, శేఖర్‌రెడ్డి, మోహన్‌నాయక్, రాములు, తిరుపతిరెడ్డి, శశిధర్ తదితరులున్నారు.

ఖాతాదారులు కేవైసీ చేసుకోవాలి

పాలమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ఆర్ఎం షీలా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లను తీసుకోవాలని సూచించారు. ఖాతా కార్యకలాపాలపై పరిమితులను నివారించటానికి ఖాతాదారులు తమ కేవీఐసీ సమాచారాన్ని బ్యాంకుకు సమర్పించాలని తెలిపారు. పొదుపు, కరెంట్ ఖాతాలు పనిచేయని ఖాతాదారులు నవీకరించిన కేవైసీ పత్రాలను సమర్పించడం ద్వారా తిరిగి సక్రియం చేయడానికి ఆయా శాఖలను సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

గండీడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల ఎంపీడీవో మంజుల బాధ్యతలు స్వీకరించడంతో బహుజన సంఘాల నాయకులు, సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హరిచంద్రారెడ్డి, కార్యాలయ సిబ్బంది, బోరుకృష్ణయ్య, చెన్నయ్య, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ

గండీడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెన్నచేడ్‌లో హెల్త్ సెంటర్ భవనానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ అలీం, ఏపీవో హరిశ్చంద్రుడు, టీఏ శ్రీనివాస్, కార్యదర్శి కేశవులు, పులిందర్‌రెడ్డి, జీపీవో శ్రీనివాసులు, శివమల్లప్ప, చంద్రయ్య, రాములుగౌడ్ పాల్గొన్నారు.

23 నుంచి ఆలయ మహోత్సవాలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్వీఎస్ గుట్ట సమీపంలో కొత్తగా నిర్మించిన కంఠ మహేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్ల ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సత్తూర్ వెంకటస్వామి గౌడ్, యాదగిరి రాజయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 23న ప్రారంభ పూజలు, హోమాలు, 24న సురమాంబ కంఠ మహేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్టాపనలు, సాయంత్రం బోనాలు ఊరేగింపు కార్యక్రమాలు ఉంటున్నట్లు తెలిపారు. 25, 26న కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

జడ్పీ మాజీ వైస్ చైర్మన్‌కు సన్మానం

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలోని వెల్ ఎడ్యుకేషన్ అండ్ పీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోషల్ సర్వీస్ విభాగంలో డాక్టరేట్ అందుకున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్యను మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువకప్పి సన్మానించారు. మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

మత్తుకు దూరంగా ఉండాలి

గండీడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విశ్వభారతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భీంరెడ్డి, వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మొక్కజొన్న దళారుల పాలు


దేశాయిపల్లిలో దళారికి మొక్కజొన్న అమ్ముకుంటున్న రైతులు

- తక్కువ ధరకు అమ్ముకుంటున్న రైతులు
- పంట చేతికొచ్చినా ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- ఉమ్మడి గండీడ్ మండలంలో వెయ్యి ఎకరాల్లో సాగు

గండీడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారు. ఉమ్మడి గండీడ్ మండలంలో వర్షాకాలంలో దాదాపు 800 నుంచి వెయ్యి ఎకరాల్లో రైతులు మొక్క జొన్న సాగు చేశారు. మొక్క జొన్న కోతలు కోసి 20 రోజులు అవుతుంది. కొందరు పంట నూర్పిడి చేసి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర వస్తుందని ఆరబెట్టి నిల్వ ఉంచుకుంటున్నారు. వర్షాలు పడుతుండడంతో పంట తడిస్తే ఇంకా నష్టపోతామనే భయంతో ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,400 కాగా ప్రైవేటు వ్యక్తులు రూ.1,800 నుంచి రూ.2 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక క్వింటాలుకు రూ.500 వరకు నష్ట పోతున్నారు.

ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. వచ్చిన వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- రాధమ్మ, ఏవో, గండీడ్

నష్టపోతున్నాం



ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. సరైన సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- బైకని రాఘవేందర్, రైతు, మొకర్లాబాద్

ప్రైవేటులో అమ్ముకున్నా



ఆరు ఎకరాల్లో మొక్కజొన్న వేశా. అధిక వర్షాలకు దిగుబడి తక్కువగానే వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకాపోవడంతో వారం రోజులు ఎదురు చూసి 106 క్వింటాళ్ల మక్కలు ప్రైవేటులో అమ్ముకున్నా. రూ.2,050 క్వింటాలుకు ఇచ్చారు.

- అంజిలయ్య, రైతు, లింగాయపల్లి

'దళితులపై దాడులు అరికట్టాలి'


గండీడ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గండీడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మీద జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ మల్లికార్జునరావుకు వినతి పత్రం అందజేశారు. దళితులపై దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బోరు కృష్ణయ్య, కామి వెంకట్రాములు, వెంకటయ్య, ఆశన్న, చెన్నయ్య, వివేకానంద, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జడ్చర్ల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బిక్షపతి, బాల్‌రాజ్, కరాటేశ్రీను, యాదయ్య, రాజేష్, కొంగళిశ్రీకాంత్, రమేశ్‌నాయక్, రవికిశోర్, విజయ్‌కుమార్, శ్రీను, మహేష్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ లిఖితారెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. శేఖర్, విష్ణువర్దన్, జగన్, యాదయ్య, లింగం పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చీరాల సమీపంలోని వాడరేవు బీచ్‌లో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన బాదం సాయిమణిదీప్‌కు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలోని సాయిమణిదీప్ గృహంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు బాదం రాఘవేందర్, బాదంలక్ష్మయ్యలతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బాదిమి ధ్రువకుమార్, సూరిశెట్టి పవన్, సూరిశెట్టిసందీప్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ అటెండర్స్‌కు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ వేతనాలు ఇష్టం వచ్చినపుడు ఇస్తున్నారని, దీంతో పూట గడవక పస్తులుంటున్నారన్నారు. ఇప్పటికి రెండు నెలల వేతనాలు ఇవ్వాలని అన్నారు. కనీసం ఈ దీపావళి పండుగ రోజైనా వేతనాలు ఇవ్వాలని కోరారు. చెన్నయ్య, అంజి, యాదయ్య, పద్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయడంతో నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చిత్రపటానికి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. జలేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపావళి వేడుకలు


శ్రీచైతన్య పాఠశాలలో లక్ష్మీపూజ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


దీపావళి ఆకారంలో కూర్చున్న సాహితి హైస్కూల్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్‌లో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ పండుగ రోజు టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకువాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం భాస్కర్‌రెడ్డి, ఐపీఎల్ శంకర్, మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూత్పూర్: దీపావళి వేడుకలను మునిసిపాలిటీలోని సాహితి హైస్కూల్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో విద్యార్థులు దీపావళి ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు కరస్పాండెంట్ సత్యనారాయణ పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు.

అత్యవసర సమయంలో సీపీఆర్ ముఖ్యం


మిడ్జిల్: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

మిడ్జిల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యే వారికి సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలను రక్షించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వేర్వేరుగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన ఉండటం అత్యంత అవసరమని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం కృష్ణకుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండీడ్: మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలకు, బీసీ హస్టల్ విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ఎలా చేయాలని వైద్యాధికారులు చంద్రశేఖర్, శరత్‌చంద్ర అవగాహన కల్పించారు. వార్డెన్ కృష్ణయ్య, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, పుష్పమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌కు వెళితే అరెస్టులు చేస్తారా?

పాలమూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్స్ అమలుపై కుట్రలు చేస్తోందని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శులు ఏ.రాములు, బీ.బాలకిషన్, వెంకటేష్ అన్నారు. శుక్రవారం వేర్వేరుగా నిరసన, ప్రెస్‌మీట్‌లు పెట్టి బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఒకవైపు కేంద్రంలోని బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ మరొకవైపు రాష్ట్రంలో ఈనెల 18న బీసీ బంద్‌కు మద్దతు ఇచ్చిందన్నారు. గవర్నరుకు వినతిపత్రం అందజేసేందుకు వామపక్షపార్టీలు అనుమతి అడిగితే నిరాకరించారని తెలిపారు. దానిని నిరసిస్తూ రాజ్‌భవన్‌కు వెళితే అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కిల్లెగోపాల్, చంద్రకాంత్, రాజ్, ప్రశాంత్, గాలెన్న, శ్రీనాథ్, నందు, పద్మావతి, లక్ష్మణ్, గంటల శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

జడ్చర్ల: రాజ్‌భవన్ ముట్టడి సందర్భంగా సీపీఎం నాయకుల అరెస్ట్‌కు నిరసనగా శుక్రవారం పట్టణంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో ఆందోళన చేశారు. కార్యక్రమంలో జగన్, సాయిలు, లక్ష్మీదేవి, శంకర్, యాదయ్య, శ్యాంసుందర్, శివమ్మ, కరుణాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన ఎంపీ మల్లురవి

జడ్చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో జడ్చర్ల కోర్టులో శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి హాజరయ్యారు. రైతు సమన్వయ సమితికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో 2017లో కేసు నమోదైంది. ఈ కేసులో ఎంపీతో పాటు నాయకులు నిత్యానందం, పాలాది రామ్మోహన్, ఖయ్యూం, హుమాయున్, నందకిశోర్ గౌడ్, నరేశ్, రాంప్రసాద్, ఖాజామైనొద్దీన్ ఉన్నారని న్యాయవాది మాలిక్ షాకీర్ తెలిపారు.

1104 యూనియన్ రూరల్ సబ్‌డివిజన్ కమిటీ ఎన్నిక

పాలమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్-1104 యూనియన్ మహబూబ్‌నగర్ రూరల్ సబ్ డివిజన్ కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీ.బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే.బాలరాజు, కార్యదర్శిగా అశోక్, సెక్షన్ లీడర్లుగా ఇర్షాద్, జనార్దన్, సత్యనారాయణ, హన్మంతు, నెహ్రూలాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు, యాదయ్య గౌడ్, శేఖర్, రామరాజు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

- కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు ఇబ్బంది లేకుండా సాఫీగా నిర్వహించేలా అవరసమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో వీసీ హాల్‌లో వానకాలం 2025-26(ఖరీఫ్) ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో భాగంగా వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సహకార శాఖలు చర్చించి కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో అవసరాన్ని బట్టి ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న, దొడ్డు ధాన్యానికి వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని కొనాలన్నారు. ప్రభుత్వం గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2389, సాధారణ రకానికి రూ. రూ.2,369, సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నవంబర్ మొదటి వారంలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు.

విద్యార్థులకు డిజిటల్ విద్య అవసరం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో అవసరమని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. శుక్రవారం అరవిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు పంపిణీ చేయనున్నారు. వీటిని కలెక్టరేట్‌లో అసోసియేట్ ప్రెసిడెంట్ ఏవీఎస్ మల్లికార్జున్, డీజీఎం జనార్దన్ కలెక్టర్‌కు అందజేశారు. జిల్లాలో గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా కంప్యూటర్లను అందజేయడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, పరిశ్రమల జీఎం యాదయ్య, అరబిందో ఫార్మా ఫౌండేషన్ అడ్మిన్‌స్టేటర్ గోవర్ధనరావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జై భవాని సాగర్ అభివృద్ధికి కృషి


జై భవాని సాగర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

- అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

కోయిలకొండ, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలోని జలపాత అందాలు కలిగిన జై భవాని సాగర్ అభివృద్ధికి కృషి చేస్తావనిఇ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. శుక్రవారం మండలంలోని దమాయపల్లి పంచాయతీలోని జైభవాని సాగర్‌ను, అక్కడ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఇక్కడి చెట్లు, నీటి కొలనులు పర్యాటకులను ఆకర్షించే విధంగా ఉన్నాయని తెలిపారు. అటవీ శాఖ అధికారులతో సమీక్షించి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్, ఎంపీవో చంద్రశేఖర్, ఏపీవో నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయోజనాలు ఇవ్వకపోవడం దారుణం


సమావేశంలో మాట్లాడుతున్న కేసీ వెంకటేశ్వర్లు

పాలమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విరమణ ప్రయోజనాలు ఇవ్వకపోవడం దారుణమని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేసీ వెంకటేశ్వర్లు, పరమేశ్వర్, పి.వెంకటస్వామి ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పెన్షనర్లు సమావేశమయ్యారు. 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు నేటికి ప్రయోజనాలు ఇవ్వలేదన్నారు. వారి కుటుంబ పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేవకాలమంతా పొదుపు చేసుకున్న జీపీఎఫ్, జీఎల్ఐ, జీఐఎస్‌లో జమైన డబ్బును ప్రభుత్వం నెలలపాటు విడుదల చేయలేదన్నారు. సంపాదిత సెలవులను నగదుగా మార్చుకున్న బిల్లులను చెల్లించటంలేదన్నారు. సమస్యల పరిష్కారానికి 27వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతామని అందరూ తరలి రావాలని వెల్లడించారు.

చేనేత హస్తకళా ప్రదర్శనకు ఆదరణ


స్టాళ్లలో కొనుగోలు చేస్తున్న నగరవాసులు

పాలమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో చేనేత హస్తకళా సిల్క్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు అమ్మకానికి ఉంచారు. అన్ని రకాల చీరలు, డ్రెస్‌మెటీరియల్స్, పాస్మిక్ శాల్, కర్ణాటక లోని క్రేస్, ప్రింటెడ్ శారీస్, బెడ్‌కవర్లు, కుషన్ కవర్లు, లక్నోవికుర్తీస్, డోర్ కర్టన్స్ ప్రదర్శనకు ఉంచారు. చేతితో తయారు చేసిన ఆహార పదార్థాలను అమ్ముతున్నారు. ప్రజలు ప్రదర్శనను వినియోగించుకుని చేనేత కళాకారులను చేయూత అందించాలని నిర్వాహకులు కోరారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

మూసాపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అడ్డాకుల మండల శివారులోని ప్రగతి స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే కార్మికుడి మృతిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లాల్‌సింగ్ (24) మిల్లులో కార్మికుడిగా పనిచేసేవాడని, మిల్లుకు సంబంధించిన నివాస సముదాయలో తల్లి, సోదరి, బావతో కలిసి ఉంటున్నాడని తెలిపారు. గురువారం సాయంత్రం మెట్లపై నుంచి అతడు ప్రమాదవశాత్తుగా కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కార్మికులు అడ్డాకుల ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మధ్యరాత్రి మృతి చెందాడు. శుక్రవారం తల్లి ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీ బంద్‌కు సబ్బండ వర్గాల మద్దతు

- బీసీ జేఏసీ నాయకుల వెల్లడి



మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి

పాలమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ 42శాతం అమలు కోసం శనివారం చేపట్టనున్న బంద్‌కు ఉమ్మడి జిల్లాలోని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, కుల సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించారని ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజకీయ, కార్మిక, ప్రజాసంఘాలు, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. బంద్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారులు, ఆటోలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని పిలుపునిచ్చారు.

అఖిల భారత యాదవ మహాసభ మద్దతు

బీసీ బంద్‌కు అఖిల భారత యాదవ మహాసభ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనరసింహయాదవ్, అల్లి సాయి ప్రకటించారు.

భూత్పూర్: బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఆ దిశగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మునిరంగస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు సత్యనారాయణ, టీ. మురళీధర్‌గౌడ్ మాట్లాడారు.

రాజాపూర్: బీసీ బంద్‌కు మండల బీసీలందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. మండల కేంద్రంలోని స్థానిక కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. నరహరి, రామకృష్ణ, లక్ష్మయ్య, కృష్ణయ్య, రమణ పాల్గొన్నారు.

తెలంగాణ బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి

మహబూబ్‌నగర్: స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో ప్రయత్నిస్తున్నారని, కొన్ని దుష్ట శక్తులు అడ్డుపడుతున్నాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కు కాంగ్రెస్ మద్దతు తెలుపుతుందని, జిల్లాలోని పార్టీ శ్రేణులంతా ఉదయం నుంచి పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రబంద్‌కు సంపూర్ణ మద్దతు

మహబూబ్‌నగర్ అర్బన్: బీసీ రిజర్వేషన్ బంద్‌కు మిల్లీ మహాజ్ తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని మిల్లీ మహాజ్ కన్వీనర్ తఖీ హుస్సేన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బంద్‌లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గండీడ్: బీసీ బంద్‌కు అన్ని కుల సంఘాల నాయకులు ఐక్యమత్యంతో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంఘం సభ్యులు అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నర్సప్ప, ఏవీ రాములు, కొమిరె లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: మండలంలో బీసీ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు వేర్వేరు కార్యక్రమాల్లో తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల మద్దతు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: బీసీ బందుకు ఉపాధ్యాయ సంఘాలు నైతిక మద్దతు ఇస్తున్నట్లు పలు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం మాడల్‌బేసిక్ పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, వెంకటేశ్, రవికుమార్, బాబు నాయుడు, జుర్రునారాయణ తదితరులు పాల్గొన్నారు.